## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

దమ్మపేట: ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని గండుగుల పల్లిలో ఆయన పలు శాఖల అధికారులతో మాట్లాడారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలో జరుగుతున్న ఆర్అండ్బీ పనులపై ఆశాఖ అధికారులతో సమీక్షించారు. దమ్మపేట మండలంలో వంతెన నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కోరారు. వెంటనే ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో నిలిచిపోయిన మిషన్ కాకతీయ పనులను ప్రారంభించాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో రెండు జిల్లాలు రాష్ట్రంలోనే ముందుండాలన్నారు. అనంతరం పలు మండలాల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. మంత్రిని కలిసిన వారిలో ఆర్అండ్బీ ఈఈ రవీంద్రనాథ్, డీఈఈ తానేశ్వరరావు, జేఈ సూరిబాబు, ఆయిల్పాం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, పైడి వెంకటేశ్వరరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, సత్తుపల్లి ఎంపీపీ అప్పారావు, అశ్వారావుపేట జడ్పీటీసీ అంకత మల్లిఖార్జునరావు, మట్టా దయానంద్ విజయ్కుమార్, కాసాని నాగప్రసాద్, తాటి పోతురాజు ఉన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## కోతల్లేని విద్యుత్తు అందించిన ఘనత కేసీఆర్‌దే



కంచిరావుపల్లి : తెలంగాణను విద్యుత్తు కోతల్లేని రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్య మంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లిలో 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే చిన్నారెడ్డితోపాటు నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి పురుశోత్తంరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడితే రాష్ట్రం చీకటిమయం అవుతుందని కొందరు అన్నారని, అది తప్పని నిరూపించారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రైతు పక్షపాతి అని, నిత్యం రైతుల గురించి ఆలోచిస్తూ అనేక పథకాలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా 24 గంటలు విద్యుత్తు సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు.

కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో అనేక విద్యుత్తు ఉపకేంద్రాలు మంజూరు చేశారన్నారు. రైతుల కష్టాలు తొలగించారన్నారు. బడ్జెట్లో విద్యుత్తుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని నిరంజన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ బుచ్చారెడ్డి, ఎంపీపీ పద్మావతి, జడ్పీటీసీసభ్యుడు ప్రకాశ్, వైస్ ఎంపీపీ జగన్నాథం నాయుడు, విండో అధ్యక్షుడు కోదండరాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గోవిందునాయుడు, హైజాక్, హనుమన్న, తెరాస నాయకులు హరిశంకర్‌నాయుడు, గౌడు నాయ క్, ముస్తాక్, శాంతన్న, నాగరాజుగౌడుతోపాటు కాంగ్రెస్ నాయకులు గ్రామస్థులు, విద్యుత్తుశాఖ అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తీర్చాలని ఆందోళన

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఆరునెలలుగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. గురువారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. స్థానిక మహిళలు అక్కడకు ఖాళీ బిందెలతో వచ్చి పంచాయతీ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

సమస్య పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఇటీవల మిషన్‌భగీరథ ట్యాంకు నిర్మాణం పూర్తయినా పలువీధులకు నీరు సరిగా రావడం లేదు. ఆరు నెలలుగా ఈ దుస్థితి నెలకొందని ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇబ్బందులు తీర్చకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టంచేశారు. ట్యాంకు సైతం లీకవుతోందని, పనుల్లో నాణ్యత సరిగా పాటించలేదని వాపోయారు.

పైప్‌లైన్లు సైతం పలుచోట్ల లీకవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపసర్పంచి సత్యనారాయణ, భిక్షపతి గౌడ్, గుండె యాదయ్య, ఆంజయ్య, శివ కుమార్, మాణయ్య, నాగేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఈ విషయమై నర్సాపూర్ ఎంపీడీవో శ్రవణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## గొర్రెలకు బీమా తప్పనిసరి

**దూరదృశ్య సమీక్షలో మంత్రి శ్రీనివాస్‌యాదవ్**

సంగారెడ్డి టౌన్: గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అందజేస్తున్న గొర్రెలకు తప్పనిసరిగా బీమా చేయించాలని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. సచివాలయం నుంచి జిల్లా అధికారులతో దూరదృశ్య సమీక్షలో ఆయన మాట్లాడారు. గొర్రెల పంపిణీ పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి స్పందన ఉందని పేర్కొన్నారు. గొర్రెలకు బీమాతో పాటు జియో ట్యాగింగ్ చేయాలన్నారు. పాలనాధికారి అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి, గొర్రెలు రవాణా జరిగినప్పుడు అనుమతి ఉన్నదీలేనిదీ పరిశీలించాలని సూచించారు. అనుమతిలేకుండా జరుగుతున్న గొర్రెల రవాణాకు చెక్‌పెట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ నుంచి సంచార వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం చేయాలని పేర్కొన్నారు. 1962 అత్యవసర నంబరును వినియోగించుకునేలా చూడాలన్నారు. 12 నుంచి 24 నెలల మధ్య వయస్సు ఉన్న గొర్రెలను కొనుగోలుచేయాలని సూచించారు. గొర్రెల మరణాల శాతాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా నుంచి పాలనాధికారి మాణిక్కరాజ్, అసిస్టెంట్ కలెక్టర్ జితేష్ వి పాటిల్, పశుసంవర్ధక శాఖ జేడీ రామారావురాథోడ్, పోలీసు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రాయితీ గొర్రెలు అమ్మితే చేస్తే చర్యలు

**పాలనాధికారి స్పష్టీకరణ**

ఆదిలాబాద్ : కొనుగోలు చేసిన గొర్రెలను అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలని పాలనాధికారి బుద్ధప్రకా ష్‌ఎం. జ్యోతి అధికారులను ఆదేశిం చారు. గొర్రెల పంపిణీ కార్యక్రమంపై సచివాలయం నుంచి రాష్ట్రమంత్రి శ్రీనివాస్ యాదవ్ దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా పాలనాధికారి జిల్లా పరిస్థితిని మంత్రికి వివరించా రు. అనంతరం అధి కారులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో మానిటరింగ్, విజులెన్సు కమిటీలను ఏర్పాటు చేయాల న్నారు. గొర్రెలకు బీమా చేయించాలని సూచించారు. గొర్రెలు ఇతరులకు విక్రయించకుండా చూడాలని అధి కారులకు సూచించారు. పోలీసుశాఖ తరపున తమ సహకారం అందిస్తామని ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సమీక్షలో పశుసంవర్ధకశాఖ అధికారి శంకర్‌రాఠోడ్, ఏడీఏ రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సమస్యలపై ఆందోళన

మహబూబ్‌నగర్ : సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళనబాట పట్టారు. ఇందులో భాగంగా పాలనాప్రాంగణం ఎదుట నిర్వహించారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు రూ.3 లక్షలు, ఆయాలకు రూ. 2 లక్షలు గ్రాట్యూటీ ఇవ్వాలని, ఉద్యోగ విరమణ రోజున సగం పింఛను ఇవ్వాలని, సరుకులను చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినదించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, కార్యదర్శులు మల్లికాంబ, కళావతి, సీఐటీయూ జిల్లాకార్యదర్శి మల్లేష్, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి బోధనలు అనుసరణీయం

బేల: రామాయణాన్ని రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి బోధనలు మానవాళికి అనుసరనీయమని అటవీ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న అన్నారు. బేల మండలం సోన్‌కాస్ గ్రామంలో నిర్వహించిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. వాల్మీకి చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుటుంబ విలువలు ఎలా ఉండాల్లో రామాయణ కావ్యంలో సంబోధించారన్నారు. మహర్షికి మహిళలంటే అమిత మైన గౌరవమని, స్త్రీలను ప్రేమతో చూడాలని చెప్పేవారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రావుత్‌మనోహర్, తెరాస రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలురి గోవర్ధన్‌రెడ్డి, రైతు సమితి మండల సమన్వయకర్త మధుకర్, వైస్‌ఎంపీపీ, పార్టీ అధ్యక్షులు దేవన్న, నేతలు గంభీర్‌టాక్రే, యూనిస్‌అక్బానీ, మస్కేతేజారావు, సుధాంరెడ్డి, నారాయణ, ప్రమోద్‌రెడ్డి, సంతోష్, సర్పంచి బాపురావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా సార్వత్రిక సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం : తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో గురువారం ఖమ్మంలో పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మిబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రారంభమైన ఇంటర్ పరీక్షకు మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో 169మందికి గానూ 138మంది హాజరయ్యారు. 31మంది గైర్హాజరయ్యారు.

మధ్యాహ్నం జరిగిన పదోతరగతి పరీక్షకు సంబంధించి 145మందికి గానూ 112మంది హాజరయ్యారు. 34మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షలకు సంబంధించి హైపవర్ కమిటీ సభ్యులు, డీఈవో కార్యాలయ ఏడీ మురళీకృష్ణ, డీఈసీ సభ్యులు రవిబాబు, ఖమ్మం గ్రామీణ ఎంఈవో శేషగిరిరావు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, బీవీ రామాచారి, ఏ.శ్రీనివాసరావు, ఆర్.వెంకటరాజు తదితరులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

## ఆకట్టుకున్న లోకకళా యాత్ర సాంస్కృతిక కార్యక్రమాలు



సపేటె: కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నాగ్‌పురకు చెందిన దక్షిణ విభాగం సాంస్కృతిక కేంద్రం కర్ణాటకలోని హంపీ విరూపాక్షేశ్వర ఆలయ ఆవరణలో లోకకళా యాత్ర పేరిట ఆరంభించిన సాంస్కృతిక కళాప్రదర్శన కార్యక్రమాలు ఆహూతులను రంజింపజేశాయి. కర్ణాటక, గోవా, ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన సుమారు 78 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆయా రాష్ట్రాల జానపద, సంప్రదాయ నృత్యాలు, గిరిజన కళాప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమాన్ని హంపీ కన్నడ వర్సిటీ ఆచార్య విరేశ్ బడిగేర్ ప్రారంభించారు. నాగ్‌పురకు చెందిన కార్యక్రమ నిర్వాహకుడు గోపాల్ బేతావర్, మహేశ్వరి, డాక్టర్ మోహన్‌పంచాళ్ తదితరులు పాల్గొన్నారు. ఆరంభంలో ఆదిలాబాద్‌కు చెందిన కళాకారులు ప్రదర్శించిన గిరిజన నృత్యం గుస్సాడిని చూసి స్థానికులు, విదేశీయులు కరతాళధ్వనులతో కేరింతలు కొట్టారు.

అనంతరం శ్రీకాకుళం కళాకారుల తప్పెటగుళ్ల జానపద నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. విదేశీయులు కూడా పెద్దఎత్తున కార్యక్రమాన్ని తిలకించి ఆనందించారు.

## కలెక్టరేట్ నిర్మిత భూసేకరణపై ఆర్డీవో చర్చలు

వి.వెంకటాయపాలెం : జిల్లా కలెక్టరు కార్యాలయంతోపాటు, జిల్లా అన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం ప్రతిపాదించిన రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామంలోని భూమి సేకరణకు సంబంధించి రైతులతో ఖమ్మం ఆర్డీవో పూర్ణచంద్ర గురువారం సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఖమ్మం-వైరా ప్రధాన రహదారి చెంత ఎ.26:24కుంటల భూమి సేకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రఘునాథపాలెం మండల తహసీల్దారు డి.తిరుమలాచారి, పట్టా భూములు కోల్పోతున్న రైతులు 9 మంది పాల్గొన్నారు. రైతులకు చెల్లించే ధరపై చర్చించారు. చర్చల అనంతరం తమకు ఎకరాకు కనీసం రూ.1.50కోట్లు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.25లక్షల ధర ఉందని, రెట్టింపు అంటే ఎకరాకు రూ.50లక్షల వరకు చెల్లిస్తామని ఆర్డీవో వారికి వివరించారు. జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి మరో రూ.5లక్షలకు పైగా ఇప్పించే ప్రయత్నం చేస్తానని ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు. త్వరగా భూ ధర విషయం సెటిల్ చేయాలని లేకుంటే, 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమి సేకరించడం జరుగుతుందని వారికి ఆర్డీవో చెప్పారు. త్వరలోనే ఖాళీ నివాస స్థలాలు పోగొట్టుకున్న వారితో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తహసీల్దారు తిరుమలాచారి తెలిపారు. ఈ సమావేశంలో వీఆర్వో రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు రావెళ్ల శ్రీనివాసరావు, ఆవుల కోదండరాములు, రైతులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

ఆదిలాబాద్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10తరగతి చదువుతున్న బీసీ విద్యార్థులు ఉపకారవేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి.ఆశన్న ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ-పాస్ విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆధాయ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, కుల, స్కూల్‌బోనఫైడ్, హార్డ్‌కాపీ జత చేయాలని పేర్కొన్నారు.


## భద్రాచలంలో పాప విక్రయం

**నానమ్మ ఫిర్యాదుతో వెలుగు చూసిన వైనం**



భద్రాచలం : ఇద్దరూ ఆడపిల్లలేనన్న భావం... వారికున్న పేదరికం 11నెలల పాపను అమ్ముకునే పరిస్థితికి దారితీసింది. సంతానం లేని ఓ జంట ఆ పాపను ఇస్తే పెంచిపోషించుకుంటామని కోరారు. దీనికిగానూ కొంత డబ్బు కూడా ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇది పాప నానమ్మకు తెలిసి పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనకు సంబంధించి పట్టణ ఎస్సై కరుణాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో కలివేరుకు చెందిన సంతోష్ దంపతులు భద్రాచలంలో గత కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. గోదావరి స్నానఘట్టాల వద్ద ఫొటోలు తీస్తూ జీవనం గడుపుతున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇటీవల భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చిన విజయవాడకు చెందిన దంపతులు రావూరి జయకాంత్, నాగమల్లేశ్వరి... ఫొటోగ్రాఫర్ పిల్లలను చూసి ముద్దాడారు. మాకు పిల్లలు లేరు. మీకు ఇద్దరు ఆడపిల్లలు కదా.. మాకు ఒక పాపను ఇస్తే రూ.50 వేలు ఇస్తామని అన్నారు. రూ.లక్ష ఇవ్వాలని సంతోష్ దంపతులు డిమాండ్ చేశారు. చివరకు రూ.60 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. 11 నెలల పాప మిల్కీని విక్రయించారు. వారం క్రితం మిల్కీ నానమ్మ భద్రాచలం వచ్చి చిన్న పాప కనిపించడం లేదని అడగ్గా అసలు విషయం బయటపడింది. దీంతో ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సంతోష్ విజయవాడకు చెందిన వారికి చేరవేశారు. పాపను కొన్నవారు గురువారం భద్రాచలం ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. ఇరువర్గాలు చర్చిస్తుండగా పోలీసులు వచ్చి పట్టుకున్నారు. పాపను విక్రయించిన తల్లిదండ్రులు, కొనుగోలు చేసిన జయకాంత్ దంపతులపై కేసు నమోదు చేశారు. పాపను ఆమె నానమ్మకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

## కొత్తగూడెం ఏరియాలో గులాబీ రెపరెపలు



కొత్తగూడెం సింగరేణి : సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేట్ విభాగంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) విజయ కేతనం ఎగురవేసింది. సింగరేణి ప్రధాన కార్యాలయంలో గులాబీ రంగు జెండా రెపరెపలాడింది. 544 ఓట్ల భారీ మెజారిటీతో తెబొగకాసం విజయం సాధించింది. గుర్తింపు సంఘం ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావించి విస్తృతంగా ప్రచారం నిర్వహించిన అధికార పార్టీ నాయకులు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు విజయం సాధించారు. తెరాసకు చెందిన నాయకులు వారం రోజుల నుంచి కొత్తగూడెంలో మకాం వేసి పడిన కష్టానికి ఫలితం లభించింది. కొత్తగూడెం కార్పొరేట్‌లో 1,475 ఓట్లకు గాను, 1,415 ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీబీజీకేఎస్‌కు 866 ఓట్లు పోలవగా ఏఐటీయూసీకి 322 ఓట్లు వచ్చాయి. బీఎంఎస్‌కు 103 ఓట్లు, సీఐటీయూకి 86 ఓట్లు పోలయ్యాయి. సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ 24 ఓట్లు, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘానికి ఒక ఓటు, సింగరేణి ఐక్య గని కార్మిక సంఘానికి ఒక ఓటు, గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘానికి ఒక ఓటు వచ్చాయి. 9 ఓట్లు చెల్లలేదు.

ఉభయ జిల్లాల్లోని ఏరియాల్లో తెబొగకాసం గెలుపొందడంతో సంబురాలు అంబరాన్నంటాయి. తారాజువ్వలు నింగికి ఎగిశాయి. ఓట్ల లెక్కింపు జరిగిన సింగరేణి ప్రధాన కార్యాలయ ప్రాంగణం గులాబీ వర్ణంగా మారింది. ఆ సంఘం నాయకులు, పార్టీల నాయకులు రంగులు పులుముకుంటూ సందడి చేశారు. కొత్తగూడెం కార్పొరేట్ బాధ్యతలను భుజాన వేసుకొని విస్తృత ప్రచారం నిర్వహించిన కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకటరావును, ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. టీబీజీకేఎస్ ఎన్నికల గుర్తు బాణంతో ప్రదర్శనలిచ్చారు. పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ కొత్తగూడెం పట్టణంలో ప్రదర్శనగా బస్టాండ్ సెంటర్‌లోని అమర వీరుల స్తూపం వద్దకు చేరుకొని నివాళులు అర్పించారు. ఇక్కడ జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకటేశ్వరరావు, ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రసంగించారు. తెరాస ప్రభుత్వం, సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తుందన్న నమ్మకంతోనే ఓటు వేసి గెలిపించారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు తామంతా కృషి చేస్తామన్నారు.

కొత్తగూడెం ఏరియాలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) విజయదుందుభి మోగించింది. కొత్తగూడెంలో మొత్తం 3,712 ఓటర్లుండగా 3,592 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెబొగకాసం 1,982 ఓట్లు పోలవ్వగా, ఏఐటీయూసీ 1,212 ఓట్లు వచ్చాయి. 770 ఓట్ల మెజారిటీతో తెబొగకాసం గెలుపొందింది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను
Minimum 7 days
క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# అన్నదాతల ముఖాల్లో ఆనందమే కేసీఆర్ లక్ష్యం



బేల : ఆరుగాలం కష్టపడి పండించే అన్నదాతల ముఖాల్లో నవ్వులు చూడడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని అటవీ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. అందులో భాగంగానే రైతుల అభివృద్ధి కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. బేల మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి జోగురామన్న ఉదయం నుంచి రాత్రి వరకు విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ అన్నదాతలకు సంఘటితం చేసి వారిని ఆర్థికంగా బాగుచేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం రైతు సమితులను ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు ప్రయోజనం కలిగించేందుకు ఈనెల 9 నుంచి ఆయిల్‌ఫెడ్ ద్వారా సోయాపంటలను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేటు ధరకంటే రూ.200 అదనంగా చెల్లించి మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పత్తి పంటకు మద్దతు ధర రాకపోతే విక్రయించవద్దని సూచించారు. రైతు సమితి సభ్యులు ఈ విషయంలో రైతులను చైతన్యవంతులు చేయాలన్నారు. భవిష్యత్తులు రైతులు బ్యాంకులు, దళారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండదన్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి పెట్టుబడి వ్యయం కింద ప్రభుత్వం ఎకరానికి రూ.4వేలు ఇవ్వనుందన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో మరో రెండు, మూడేళ్లలో రైతులు అప్పులిచ్చే స్థాయికి ఎదుగుతారని చెప్పారు.

అభివృద్ధి పనులకు భూమి పూజలు

మండలంలోని సోన్‌కాస్‌లో శ్మాసనవాటిక, సీసీ రహదారి, కమ్యూనిటీహాల్, కుమురం భీం విగ్రహ ప్రతిష్ఠపనకు మంత్రి భూమిపూజ చేశారు. జూనోని, టాక్లీ, బాధిలో శ్మశానవాటిక నిర్మాణాలను ప్రారంభించారు. టాక్లీలో కమ్యూనిటీహాల్, సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. చప్రాల సర్పంచి దౌలత్‌పటేల్‌తో పాటు పలువురు పార్టీలో చేరారు. సోన్‌కాస్, టాక్లీ, బాధిలో పలువురు భాజపా, కాంగ్రెస్ నాయకులు తెరాసలో చేరగా వారికి మంత్రి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రావుత్ మనోహర్, తెరాస రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలురి గోవర్ధన్‌రెడ్డి, రైతు సమితి మండల సమన్వయకర్త మధుకర్, వైస్‌ఎంపీపీ, పార్టీ అధ్యక్షులు దేవన్న, నేతలు గంభీర్‌టాక్రే, యూనిస్‌అక్బాని, మస్కేతేజారావు, సుధాంరెడ్డి, నారాయణ, ప్రమోద్‌రెడ్డి, రాఘవులు, వాడయ్‌నాందేవ్, వివేక్, రావుత్‌ప్రభాకర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మానవ విలువలు నేర్పిన మహనీయుడు

ఆదిలాబాద్ : రామాయణమనే గొప్ప కావ్యాన్ని రచించి కుటుంబ విలువలతోపాటు మానవ జీవనం ఎలా ఉండాలో తెలియజేసిన మహారుషి వాల్మీకి అని జిల్లా సంయుక్త పాలనాధికారి కృష్ణారెడ్డి కొనియాడారు. ఆదిలా బాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత వాల్మీకి జీవిత చరిత్రపై ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ రామాయణ కావ్యం ద్వారా సమాజానికి దిశా నిర్దేశం చేశారన్నారు. ప్రజలకు మేలు చేసేలా పాలన ఎలా ఉండాలో రామాయణ కావ్యంలో స్పష్టంగా వివరించారని కొనియాడారు. ఏ పనినైనా మనసుపెట్టి చేస్తే సులువుగా సాధించవచ్చనడానికి వాల్మీకి జీవితమే నిదర్శన మన్నారు. కార్యక్రమంలో డీఆర్వో శంకర్, బీసీ సంక్షేమశాఖ అధికారి ఆశన్న, సాంఘిక సంక్షేమశాఖ అధికారి కిషన్‌యాదవ్, పర్యవేక్షకుడు రాజేశ్వర్, టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు దారట్ల కిష్టు, బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు ప్రవీణ్‌కుమార్, రమేశ్, బీసీ సంఘం అధ్యక్షుడు ఈర్ల సత్య నారాయణ, నాయకులు అన్నదానం జగదీశ్వర్, బండారి దేవన్న తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం

### ప్రచార రథం ప్రారంభోత్సవంలో ఎస్పీ ఎం.శ్రీనివాస్

ఎదులాపురం : ప్రజల రక్షణ, శాంతిభద్రతల కోసం ప్రాణత్యాగాలు చేసిన పోలీసు అమరవీరుల ఆశయాలను కొనసాగి స్తామని, వారి కుటుంబ సభ్యులకు జిల్లా ప్రజలు అండగా నిలవాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రజల కోసం ఇప్పటి వరకు 48 మంది పోలీసులు కీలకపాత్ర పోషించి అమరులైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పోలీసు రెండో భారత పోలీసు అమర వీరుల సంస్మరణ పరుగుపందెం ప్రచార రథాన్ని ఆయన ఆదిలాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి జెండా వూపి ప్రారంభించారు. అనంతరం పట్టణంలో ప్రచార రథంతో పాటు అమరవీరుల కుటుంబ సభ్యుతో కలిసి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 15న హైదరాబాద్‌లో పిపుల్స్ ప్లాజా నెక్లెస్ రోడ్డులో ఉదయం ఆరు గంటలకు రాష్ట్ర స్థాయిలో మూడు విభాగాలుగా 2కే. 5కే, 10కే రన్ నిర్వ హిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో పాల్గొనదలచిన వారు లాగిన్ అయి తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దేశం కోసం ఎంతో మంది అమరులవుతున్న పోలీసుల సంస్మరణ కోసం ఇందులో జిల్లా నుంచి ఔత్సాహికులైన యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్య క్రమంలో పట్టణ డీఎస్పీ ఏ.లక్ష్మీ నారాయణ, పట్టణ సీఐలు వి.సురేష్, టి.స్వామి, ఆర్ఐ బి.జేమ్స్, ఆర్ఎస్ఐ బి.పెద్దయ్య, ట్రాఫిక్ ఎస్ఐ బి.వెంకటేష్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీసు కార్యాలయ అధికారులు జె.భారతి, కే.పుష్ప, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదులపై దాడులకు నిరసనగా ఆందోళన

ఎదులాపురం : హైదరాబాద్‌లో సీనియర్ న్యాయవాది గోపాల్‌రెడ్డిపై ఇటీవల కొందరు దుండగులు దాడి చేయటంతో పాటు ఆయన గొంతు కోయడానికి ప్రయత్నించిన సంఘటన హేయమైనదని, ఇలాంటి వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈ సంఘటనను నిరసిస్తూ జిల్లా కోర్టు న్యాయవాదులు బార్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో కొద్ది సేపు నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ సింగ్ మాట్లాడుతూ ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయవాదులు తప్పు చేసినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి తప్ప ఇలాంటి అప్రజాస్వామిక దాడులకు పాల్పడటం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నిరసన కార్య క్రమంలో ఆ సంఘం కార్యదర్శి సుధీర్‌కుమార్, సభ్యులు బద్రీ, సమీంష ఉల్లాఖాన్, పూండ్రు సుధాకర్‌రెడ్డి, చందూసింగ్, ఎం.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, శర్మ తదితరులు పాల్గొన్నారు.


## అవగాహన సదస్సులు నిర్వహించాలి

### ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ ఆర్.సత్యనారాయణ

ఎదులాపురం: ఆరోగ్యశ్రీ పరిధిలో ప్రజలకు అందజేసే సేవల గురించి జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ ఆర్.సత్య నారాయణ సూచించారు. ఆరోగ్యశ్రీ కార్యాలయంలో నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, బెల్లంపల్లి డివిజన్ల బాధ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన వారికి పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆరోగ్యమిత్రలను ఎప్పటికప్పుడు కలుసుకుంటూ వారి పురోగతి వివరాలను తెలుసుకోవాలన్నారు.

ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చిన అవయవ మార్పిడి గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య శ్రీసేవల గురించి తెలుసుకోవడానికి ఆయా ప్రాంతాల ప్రజలు తెలుసుకోవడానికి వీలుగా చరవాణి సంఖ్యలను ప్రకటించారు. ఆసిఫాబాద్ ప్రాంత వాసులు 83338 15993, బెల్లంపల్లి 83338 15992, మంచిర్యాల వారు 83338 15991, ఆదిలాబాద్ 83338 15990, నిర్మల్ వారు 83338 15951లపై సంప్రదించి సమాచారం పొంద వచ్చన్నారు. ఈ సమావేశంలో ఆయా డివిజన్ల బాధ్యులు గణేష్, రాకేష్, శ్రీనివాస్, వ్యాస్, భూమారెడ్డి, కార్యాలయ సిబ్బంది పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 40.63 క్వింటాళ్ల నూకలు, బియ్యం పట్టివేత



హుస్నాబాద్ : హుస్నాబాద్‌లో చౌక బియ్యాన్ని నూకలుగా మార్చి తరలించేందుకు లోడింగు చేస్తున్న లారీని పోలీసులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. హుస్నాబాద్‌లో ఓ వ్యాపారి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చౌక బియ్యాన్ని లోడింగు చేస్తున్న సమయంలో సమాచారం అందుకున్న పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి రెవెన్యూ అధికారులకు తెలిపారు. తహసీల్దార్ విజయసాగర్, సీఐ శ్రీనివాస్‌లు లారీలో ఉన్న బస్తాలను పరిశీలించారు. బస్తాల్లో కొన్నింటిలో నూకలు, మరికొన్నింటిలో పసుపు బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం తహసీల్దార్, సీఐలు వ్యాపారికి చెందిన వ్యవసాయ విపణిలో ఉన్న గోదామును తనిఖీ చేశారు. అక్కడ నాలుగు బస్తాల బియ్యం ఉండగా వ్యాపారి కృష్ణమూర్తి మాత్రం తాను రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పసుపు బియ్యం కొనుగోలు చేసినట్లు వారికి ధ్రువపత్రాన్ని చూపించారు. చౌక బియ్యం కొనుగోలు చేయలేదని వివరించగా వ్యాపారానికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని కోరారు. అనంతరం వాటిని పౌర సరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు. పౌర సరఫరాల శాఖ డిప్యూటి తహసీల్దార్ మధుసూదన్ లారీలో ఉన్న 35.87 క్వింటాళ్ల నూకలు, 4.63 క్వింటాళ్ల పసుపు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. మొత్తం 40.50 క్వింటాళ్లకు సంబంధించి నిల్వలను పౌర సరఫరాల గోదాముకు తరలించి 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ విజయసాగర్ తెలిపారు. చౌక బియ్యాన్ని నూకలుగా మార్చి రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం కరవు మండలాలను ప్రకటించాలి

కందనూలు : ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయిన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కరవు మండలాలను ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం నాగర్‌కర్నూల్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం, నాగర్‌కర్నూల్ గ్రామ శివారులో ఎండిపోయిన మొక్కజొన్న, వర్షంతో దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా రోజులుగా సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో మొక్కజొన్న, ముసురు వర్షాలకు పత్తి, జొన్న పంటలు పూర్తిగా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పత్తికి క్వింటాలుకు రూ. 8 వేల గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు నిరంజన్, బాలపీరు, గంగోజీ, అరవిందాచారి తదితరులు పాల్గొన్నారు.

## మండపంలో సుదర్శన నారసింహ హోమం



యాదగిరిగుట్ట : ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి బాలాలయంలో శ్రీ స్వామిని ఆరాధిస్తూ శ్రీ సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. ఆలయ సంప్రదాయంగా వేదమంత్ర పఠనాల మధ్య జరిగిన హోమాది పూజల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. నిత్య ఆరాధనల్లో భాగంగా వేకువజామున సుప్రభాతం, బిందెతీర్థం, బాలభోగం పర్వాలు జరిగాయి. ప్రతిష్ఠామూర్తులకు హారతిని నివేదించిన పూజారులు ఉత్సవమూర్తులకు అభిషేకం, అర్చన చేపట్టారు. వేద పండితుల పఠనాల మధ్య గంటన్నర పాటు కొనసాగిన అభిషేకం, అర్చనల్లో భక్తులు పాల్గొని ఆశీర్వచనాలు పొందారు. కవచమూర్తులకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. మహామండపం లో సహస్రనామాలతో కొలుస్తూ అష్టోత్తరం జరిపారు. నిత్య కల్యాణోత్సవ పర్వాలను శాస్త్ర1క్తంగా చేపట్టారు. విష్వక్సేన పూజతో మొదలైన కల్యాణ పర్వాలు తలంబ్రాలధారణతో ముగిశాయి. గజవాహనోత్సవాన్ని చేపట్టారు.

కల్యాణంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలతో పాటు ఆశీర్వచనాలు అందించారు. నిత్యకల్యాణ విశిష్టతను ప్రధానపూజారులు భక్తులకు వివరించారు. సాయంత్రం అలంకార జోడు సేవోత్సవాలను ఆలయ ఆచారంగా చేపట్టారు. రాత్రి ప్రతిష్ఠా లయంలో ఆరాధన, సహస్ర నామార్చనలు జరిపారు. మహామండపంలో దర్బారు సేవోత్స వాన్ని నిర్వహించి నిత్యాదాయాన్ని వెల్లడించారు.

## హాకీలో సత్తా చాటిన కడప క్రీడా పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కడప : గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరిగిన 63వ రాష్ట్ర హాకీ పోటీల్లో క్రీడా పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కడప జిల్లా జట్టును విజేతగా నిలిపారని క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారి ఏ.నటరాజరావు తెలిపారు. అంతేగాకుండా గత నెల 21 నుంచి 24 వరకు అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగిన 8వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ క్రీడా పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారని తెలిపారు.

## ఎన్‌సీసీలో మహిళా కళాశాల విద్యార్థిని ప్రతిభ

రాజమహేంద్రవరం : ఎన్‌సీసీ కేడెట్ సీనియర్ అండర్ ఆఫీసర్ నాగరాజేశ్వరి సెప్టెంబర్ 18 నుంచి 30 వరకు దిల్లీలో జరిగిన ఆలిండియా తల్ సైనిక్ శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల ప్రిన్సిపల్ జి.పద్మిని ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్‌సీసీలో అత్యంత ప్రతిష్టాత్మకమైన క్యాంప్‌లో ఎంపిక నిమిత్తం నూజివీడు, కర్నూలు, అనంతపురం, సికింద్రాబాద్‌లో జరిగిన మొత్తం 10 శిబిరాల్లో పాల్గొని రైఫిల్ షుటింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజినిక్ మొదలైన విభాగాల్లో కఠిన శిక్షణ పొంది మ్యాప్ రీడింగ్ ఆర్మీ సంబంధిత అంశంలో ప్రతిభ చూపి, దిల్లీలో జాతీయ స్థాయిలో డైరెక్టర్ జనరల్ ఎన్‌సీసీ వారి నుంచి బంగారు పతకాన్ని పొందినట్లు తెలిపారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 40 మంది దిల్లీ శిబిరానికి హాజరుకాగా కాకినాడ ఆంధ్ర బాలికల బెటాలియన్ నుంచి నాగరాజేశ్వరి మాత్రమే ఎంపికైందని తెలిపారు. అఖిల భారత స్థాయిలో ప్రతిభ చూపిన నాగరాజేశ్వరిని కాకినాడ గ్రూప్ కమాండర్ కర్నల్ ఎల్.ఎస్.నాయుడు, ట్రైనింగ్ ఆఫీసర్ కర్నల్ సత్యనారాయణ, తదితరులు అభినందించారు.

## గొర్రెల పంపిణీలో జిల్లా ప్రథమస్థానం

### కలెక్టర్ గౌరవ్ ఉప్పల్‌కు మంత్రి తలసాని అభినందన

నల్గొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో నల్గొండ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన దూరదృశ్య శ్రవణ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.గౌరవ్‌ఉప్పల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాల్లో గొర్రెల పంపిణీ అనుకున్న విధంగా జరుగుతున్నదని చెప్పారు. బీమా లేకుండా గొర్రెలు చనిపోతే సమస్య వస్తుందని, కొనుగోలు చేసిన గొర్రెలకు వెంటనే ట్యాగింగ్ చేయించి ఫొటోలు అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుడు నష్ట పోకూడదని తెలిపారు. అనుమతి లేకుండా ఇతర వాహనాల్లో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు గొర్రెలను తీసుకెళ్లకుండా చెక్‌పోస్టుల వద్ద నిరోధించాలన్నారు. జిల్లాలకు కేటాయించిన 1962 అంబులెన్స్ వాహనం వినియోగంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ డా.గౌరవ్‌ఉప్పల్ స్పందిస్తూ గొర్రెలు రిసైక్లింగ్ కాకుండా వాడపల్లి, దామరచర్ల, సాగర్ చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటుతో నిరోధించినట్లు కలెక్టర్ తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద పోలీసు, రెవెన్యూ, ఆర్‌టీఏ, కమర్షియల్ టాక్స్, పశుసంవర్ధకశాఖ అధికారులతో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా నుంచి గొర్రెలు బయటకు పంపడం జరగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డా.సిహెచ్.రమేష్, ఆర్‌టీఓ చంద్రశేఖర్ గౌడ్, పోలీసు, ఆర్‌టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు రీసైక్లింగ్ జరగకుండా ట్యాగింగ్ ఉన్న గొర్రెలే కాకుండా సాధరణ గొర్రెలు కూడా జిల్లా దాటకుండా వాహనాలు నిలిపివేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పశు సంవర్ధకశాఖ మంత్రితో దూరదృశ్య శ్రవణ సమీక్షా సమావేశం అనంతరం పశుసంవర్ధకశాఖ వైద్యులతో కలెక్టర్ సమావేశమయ్యారు.

## నిరంతర పర్యవేక్షణకే సీసీ కెమెరాలు: సీపీ

### నిఘా నేత్రాల జిల్లాగా యాదాద్రి భువనగిరి

బీబీనగర్ : నిరంతర పర్యవేక్షణకే గ్రామగ్రామాన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్ భగవత్ తెలిపారు. బీబీనగర్, భువనగిరి గ్రామీణం, బొమ్మలరామారం పరిధిలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి, డీసీపీ యాదగిరితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాలతో నేరాలు చేసిన వారిని గుర్తించవచ్చని, తద్వారా నేరాలు అదుపులోకి వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరు జాగ్రత్తగా మెదులుకునే అవకాశం ఉందని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేశాక చాలా చోట్ల నేరాలు తగ్గయాని, నేరాలను సులువుగా ఛేదించగలిగామని చెప్పారు. దాతల సహకారంతో భువనగిరి నియోజకవర్గంలో బీబీనగర్‌లో 98, బొమ్మలరామారంలో 50, భువనగిరి గ్రామీణంలో 32 సీసీ కెమెరాలను కలిపి మొత్తం 180 కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లలో కెమెరాల నియంత్రణ ఉంటుందని తెలిపారు. భువనగిరి, చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణ పూర్, బీబీనగర్, బొమ్మలరామారం మండలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఆలేరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో బిగిస్తున్నారని తెలిపారు. వాటిని త్వరలో ప్రారంభిస్తామని, మిగతా మండలాలో ఏడాది చివరి వరకు కెమెరాలను అమర్చుతామని చెప్పారు. యాదాద్రి భువనగిరిని సీసీ కెమెరాల పర్యవేక్షణ జిల్లాగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇదంతా దాతల సహకారంతోనే సాధ్యమైందని చెప్పారు. వారిని సీపీ, విప్, ఎమ్మెల్సీ సన్మానించారు. త్వరలో భువనగిరిలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. విప్ గొంగిడి సునీత మాట్లాడుతూ తెరాస ప్రభుత్వం హయాంలో నేరాలు చాలా వరకు అదుపులోకి వచ్చాయని చెప్పారు. ముఖ్యంగా సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు చేయాలంటేనే దుండగులు భయపడుతున్నారని తెలిపారు.

